# బటాణీలా బిస్కట్లూ

మా ఇద్దరికీ మంచి సీట్లే దొరికేయి ఆ రైల్వే కంపార్ట్మెంటులో ఎదురెదురుగా సైడ్స్కి ఉన్న సింగిల్ సీట్సు. మరొక మారు రంగివైపు చూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. నిన్న నేను చూసినప్పుడు ఎలా ఉండేది! ఇంతలో ఎంత మార్పు! ఆ ఆలోచనలో చిన్న గర్వం లాంటిది కూడ కలిగింది నాకు.

ఎంత సేపూ ఎడంచేతి వేలు నోట్లో, కుడి చెయ్యి బరుక్కుంటూ చింపిరి తలమీద, మాసిపోయిన, మాసికలువేసిన బట్టలు. మట్టికొట్టుకు పోయిన బతుకులు! దీన్నింతగా మార్చి తిరుగు ప్రయాణంలో దీన్ని తీసుకు వస్తా ననుకున్నానా! జరిగిందంతా ఓ కలలా ఉంది.

రాయగడలో సాహితీ సభలు జరిగేయి. అక్కడ అనుకోకుండా నేనూ రవీ కలిశాం ఎన్నో ఏళ్ళ తర్వాత. అక్కణ్ణుంచి వాళ్ళ ఊరు చీపురుపల్లి వెళ్ళాం. మా యిద్దరి వయసుల్లో ఓ ఏడేళ్ళ తేడా లేకపో లేదు. కలుసుకోకపోవాలి గాని యిహ ఓ నిమిషం విరహం ఓర్చం. రాత్రి, పగలూ తిండీ, నిద్రా ఫుల్స్టాపూ, కామా లేకుండా యిహ కబుర్లే కబుర్లు. ఆ సందర్భంలోనే నా కొత్త బాధ ఒకటి ఒలికించాను.

"మళ్ళీ స్వయానా మా పెత్తల్లి కూతురు. ఈః సారి మా అక్కయ్య గుమ్మం తొక్కడానిక్కూడా నా మొహం చెల్లడం లేదు. నిలబెట్టుకో లేనప్పుడు వాగ్దానాలు వెయ్యకూడదు, ఏమంటావ్?"

"ఆదేవిఁటయ్యా, వాళ్ళు మంచి వ్యాపారస్తులన్నావ్. నీ చేత ప్రామిస్ చేయించుకునే కర్మ వాళ్ళకేం?" అని రవి అడిగాడు.

"ఏం చేస్తాం .... ఎంత అప్పుకి అంత డౌను అన్నారు. సిరిసంపద లుంటే సరా? ఇక్కడ వస్తువు అక్కడ తీసిపెట్టే సౌకర్యం ఇంట్లో

వుండాలి గద! ఆ ఇంట్లో ఎవరెప్పుడడుగు పెట్టినా, పనిమనిషి లేదని ఒకటే రొద. అందులో ఈ మధ్య నే వెళ్ళినపుడు మా అక్కయ్య మరీ నా ప్రాణం తోడేసిందనుకో.''

"ఏమంటుందేం?"

"ఆఁ ఏముందీ, ఎక్కడయినా మంచి పనిమనిషిని చూడమనీ. ఎంతయినా యిస్తుందట. అంతమందికి వండి, వడ్డించలేక ఆవిడగారి ప్రాణం సొమ్మసిల్లి పోతోందిట. ఇక అంటుగిన్నెలు కూడా ఎక్కడ తోమనని కళ్ళ నీళ్ళ పర్యంతమయింది. రాత్రీ పగలూ పడివుండే మనిషి కావాలిట. అన్నం, బట్టా, కోరిన జీతం. నేనెంత చెబితే అంతా యిస్తుం దిట. పొరబాటున అన్నాను, నే నెవర్తినో ఒకత్తిని పై ఊర్నించి ఐనా తెచ్చి కుదురుస్తానని....

అంతే. ఆ మాట పట్టుకు కూచుంది. మా ఊరు చేరుకున్నానో లేదో....ఇక చూసుకో... అవే ఉత్తరాలు, అవే టెలిగ్రాములు. ఏదో అన్నాను గాని అంత కంగారైతే నేనెక్కడ చావనూ, ఇదేం బజార్లో దొరికే వస్తువా?''

"పోనీ మా దాసీమనిషి లచ్చప్ప రెండోకూతురు నీతో వస్తుందేమో కనుక్కోనా?" అన్నాడు రవి.

ఆ మాటతో పోయిన కరెంటు వచ్చినట్టయింది నా ప్రాణానికి. లచ్చప్ప కథ వివరించాడు రవి.

దాని మొగుడూ ఒకప్పుడు పెద్దమనిషేనట. ఐతే వాడు తెచ్చింది తక్కువా, సంసారాన్ని పెంచింది ఎక్కువా.

"ప్రతి రెండేళ్ళకి ముగ్గురేసి పిల్లలు" అనేది ధ్యేయమట. అలాంటి మొగుడితో చివరంటూ తూగలేక, వాడి కర్మకి వాణ్ణొదిలేసి, ఈ ఊరు కొట్టుకొచ్చిందట. లచ్చప్ప ఇంట్లో నలుగురూ నాలుగు పన్లూ చేసుకుని ఎలాగో పోషించుకుంటున్నారట.

ఓ గంటసేపు అన్నీ బోధపరిచాక రంగిని నాతో పంపడానికి అది ఒప్పుకుంది. దానికో నూరురూపాయలు యిచ్చాను. అదిగాక పిల్ల జీతంగా నెలనెలా పాతిక రూపాయలు తల్లికి పంపించాలనీ, రవి మధ్య వర్తిగా ఉండాలని ఒప్పందం.

అయితే దాన్ని రైలెక్కించేలోగా మేం పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఏమిటంటారా? అతని యింట్లో ఆ సాయంకాలం ఆ పదేళ్ళ గుంటముండకి అభ్యంగన స్నానం.

స్నానానంతరం, నూతన వస్త్రయుగ్మ సమర్పయామి.

అప్పటికప్పుడు రెడీమేడ్ బట్టలకొట్టు నుంచి మంచి జాకట్టూ, పరికిణీ తెప్పించి .... కట్టబెట్టించాం.

ఆ రాత్రికి రవి భార్య సీతదగ్గరే దాని పడక. అంతేనా?

మర్నాడు పొద్దున లచ్చప్ప చేత దాని జుట్టు విప్పించి, పేలు నొక్కించి, తవ్వేడు వాసన నూనె యింకిపించి .... ఇలా ఎన్నని చెప్పను! సూపర్‌విజన్ అంతా సీతదే. ఏం చెయ్యను మరీ, ఏమాత్రం దర్టీగా కనిపించినా అక్కయ్య గుమ్మం ఎక్కనివ్వదు. అంత శుభ్రం పిచ్చిదానికి!

పిల్లకి జరిగిన మేకప్ చూసి లచ్చప్ప యిరుగు పొరుగు వారంతా ముక్కున వేలేసుకున్నారు.

"ఏటేటీ, యిది రంగమ్మ తల్లే! సెంద మావఁ ఎదగడానికి పధేను దినాలు పడుద్దిగాని, నీగుంట జిగేల్మని పోడానికి ఒక్క పొద్దే ఎలా సరి పోయిందే లచ్చప్పా? దీని తలతిక్క కుదిరి కుదురుగా ఆరు సెప్పిన పెకారం యిని సావాలిగాని ఆయమ్మ ఇక దీన్నొగ్గుతాదేటే? ఏటంటావ్? కూడేటి, గుడ్డేటి, యిక ఓ ఆయ్య సేతిలో ఎట్టినా ఆరి సేతి సలవే. ఉన్నట్టుండి నీ అద్దుట్టం ఏం తిరగబడిపోనాదే ఓలమ్మా?"

రైల్లో దాన్నలా ఎదురుగా చూస్తూంటే ఎంతో తృప్తి కలిగింది నాకు. అయితే రంగి ఓ పట్టాన కొరుకుడు పడే రకంలా లేదు. అంతెందుకూ, పొద్దుట వాళ్ళమ్మే అనలేదూ, మొదట్నుంచీ దీని దంతా ఓ చిత్రమైన స్వభావమనీ .... గంటకో ముక్కగాని నోట్లోంచి ఊడి పడదనీ ... దాని మనసులో ఏముందో తనకే తెలీదనీ. మేం కలిసి ప్రయాణం చేసి రెండు గంటలు దాటే ఉంటుంది. అలా బుగ్గని ముడిచిన చెయ్యి పెట్టుకుని కూచున్న మనిషి కూచున్నట్టే వుంది. పోనీ ఆ చూపుల్లో ఏ ముందో అంటే అదీ చెప్పలేము.

అది దుఃఖమూ కాదూ, సంతోషమూ కాదూ. అంత చిన్న పిల్లలో ఆ నిర్లిప్తత ఎక్కడా చూడబోము.

'ఇదిగో, ఓ బటాణీ లబ్బీ, ఇలా రా' పిలిచింది హఠాత్తుగా. అమ్మయ్య! ఇప్పటికి రంగి గొంతుక విడింది. గొంతుక ఒక్కటే కాదు బుగ్గని ఆనించుకున్న ఆ చేతి పిడికిలి విడుతోంది. ఆ రోజు ఉదయం తల్లిని విడిచి వచ్చే ముందు రంగి ఏం అడిగిందో నాకు గుర్తొచ్చింది.

"ఒలే అమ్మా నాను ఎల్లొత్తానే ... దార్లో కొనుక్కుందికి నీ సేత్తో నువ్వు ఏటయినా యియ్యే!"

లచ్చప్ప వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అంది.

"కట్టుకున్న బొట్టిని పరాయి సేతుల్లో పెట్టేస్తున్న కసాయిదాన్ని నా కాడ ఏటుంటుంది బుల్లీ!"

కూతురి ఒళ్ళంతా ఓ మారు ప్రేమతో తడిమింది. దగ్గిరికి తీసుకుని గట్టిగా ముద్దెట్టుకుంది. చిన్న పిల్లని జాగ్రత్తగా చూసుకోండని అంపకాలు పెట్టింది. ఎక్కడున్నా రక్షించండని వెయ్యి దేవుళ్ళకి మొక్కింది. రొంటి నున్న దేదో విప్పి రెండో కంటికి కనబడకుండా దాని అరిచేతిలో నొక్కింది.

అమ్మ యిచ్చిందెవరైనా పట్టుకుపోతారేమో అన్నట్టు అప్పట్నుంచీ రంగి ఆ గుప్పిలి అలా మూసే గట్టిగా లోపలున్న దాన్ని పట్టుకునే వుంచింది. కనీసం ఏ రూపాయి బిళ్ళయినా అయి వుండదా అనుకున్నాను. నేనిచ్చిన వందరూపాయల నోటు, అక్కణ్ణుంచి ఆలాగే బియ్యం బాకీ కింద వెళ్ళి పోయిందని విన్నాను గాని, ఆ మాత్రమైనా లేకపోతుందా అనుకున్నాను.

ఇప్పుడు చూద్దునూ తెల్లబోయాను!

అది పదిపైసల బిళ్ళ! ఇంత ఘోరమా వీళ్ళ బతుకులు!

ఆ కొనుక్కున్న కాసిని బటాణీలు ఒకటీ ఒకటీ పటుకూ, పటుకూ కొరుకుతోంది. ప్రతిగింజా చేత్తో పట్టుకుని గుండ్రంగా తిప్పుతూ కొసరి కొసరి నమలుతోంది రంగి.

ఇంతలో ఓ ముష్టివాడు అక్కడికొచ్చేడు. నేరకపోయి రెండు బటాణీ గింజలు పారెయ్యమని దానిముందు చెయ్యిజాచాడు. దాన్తో రంగి వేసిన కేక ఎవరూ ఊహించనిది. ఆ కసురికి ముష్టివాడు మూడు మొగ్గ లెయ్యడం కాదు ఏకంగా ఆ రైలుకి రైలే దద్దరిల్లినట్టు అయిపోయింది.

పొద్దుటనగా చద్దెన్నం తిని రైలెక్కిన పిల్ల, పాపం ఎంత ఆకలిగా ఉంది అంత కేక వేసిందో!.... బిస్కట్లవాడు అమ్మకానికొస్తే మంచి క్రీమ్ బిస్కట్ల పేకట్ ఒకటి కొన్నాను అయిదురూపాయలిచ్చి. అది దాని చేతిలో పెట్టి "తింటూ వుండవే రంగీ అన్నీ నీకే! రైలు ఆగుతున్నట్టుంది. నే వెళ్ళి మంచినీళ్ళు తెస్తాను." అని కిందకి దిగాను. సీసానిండా నీళ్ళు పట్టుకుని తిరిగి నేను రైలెక్కేసరికి, నా ముందు దృశ్యం ఇదీ.

ఏదో బలవంతాన నోట్లో పెట్టుకున్నట్టు ఓ బిస్కట్ తీసుకుంది రంగి. మిగిలిన పొట్లం విసురుగా సీటుమీద పడేసింది. అక్కణ్ణుంచి అది కింద పడినట్లుంది. మరి ఎక్కణ్ణుంచి వచ్చిందో సమయానికి ఓ కుక్క అందుకుంది. అందరూ ఛీ ఛీ అంటూనే ఉన్నారు. అది దాన్ని నోట కరుచుకొని మాయం అవనే అయింది.

అన్నిటికన్నా ఆశ్చర్యం తన కళ్ళెదుట తన కాళ్ళ దగ్గిర ఇంత జరిగినా రంగి పట్టించుకున్నట్టేలేదు. రెండు బటాణి గింజలు అడిగితేనే బిచ్చగాణ్ణి తరిమి కొట్టిన రంగి అంత ఖరీదయిన బిస్కట్లు పొట్లం కుక్క తన్నుకు పోతూంటే కనీసం అందరితోపాటు తనూ "ఛీ" అనదేం? బటాణీల ముందు బిస్కట్లే తీసికట్టా! నాకేదో తెలిసినట్టయింది. గుండె చేత్తో పట్టుకుని కూలబడ్డాను సీట్లో దానివైపే చూస్తూ.

"నేను ఎందుకు ఛీ అనలేదో తెలుసా? ఆ అక్షరం నీలాంటి వాళ్ళ కోసం దాచి ఉంచాను గనుక" అన్నట్టు తోచింది అది. అంతేకాదు సుతి మెత్తని నా మనసు మీద మాటాడకుండా రంగి చాలా సుత్తిదెబ్బలే వేసింది.

"చెమటోడ్చి నన్ను పెంచింది మా అమ్మ. కన్నీళ్ళతో సాగనంపుతూ కడుపు తడిమి నా చేతిలో పెట్టింది. ఎంత తక్కువైతేనేం. దాన్తో కొనుక్కున్న బటాణీల రుచి నీకెలా తెలుస్తుంది? సంతలో కొనుక్కున్న గొడ్డుని తోలుకుపోతున్నట్టు నన్ను తీసుకెడుతున్నావు. నువ్వు ఎంత డబ్బు పెట్టి కొంటేనేం, అవి కుక్కలకే తగును! వెలకాదు, విలువ ముఖ్యం. ఆ మాత్రం నీకు తెలీదా?"

అంత చిన్నపిల్ల అంత గట్టి ప్రశ్నవేసిందా అంటే నేను చెప్పలేను. రంగి అలా ప్రవర్తించడానికి కారణం అదే అని కూడా రుజువు చెయ్య

తేను. కాని దాని చూపులూ, చేష్టలూ మొదట్నుంచీ నన్ను తికమక పెడు తూనే వున్నాయి. వాటికి అర్థం నా కలాగే తోచింది అంతే.

ఆ తర్వాత మా ఊహా సంభాషణ యిలా సాగింది :

'అదేవిఁటి, నేను నీకు హాని తలబెట్టి తీసుకెడుతున్నానా? ఒక్క రోజులో నిన్నెంత చక్కగా తయారుచేశానో చూడు'

'గుళ్ళోకి మేకని పంపుతారు చూడు, బలికోసం దాన్ని అలంక రిస్తారు మరి. స్నానం చేయించి, పసుపు-కుంకుమా పెడతారు. గంటలూ, పువ్వులూ కడతారు. ముస్తాబుచూసి మురిసిపోవడానికి, మే మేం పశువులం కాదు. ఆలోచించ గల మనుషులం. అయినా వున్నట్టుండి మా కుటుంబం మీద యింత దయ పుట్టుకొచ్చిందేం మీకు ? అదేం మాకు ఉపకారం కాదు. మీకు అవసరం. యావజ్జీవం చాకిరీకి ఓ బానిసని చవగ్గా కొను క్కుని తీసికెడుతున్నావు. ఎవరికి తెలీదని! ఇందులో దళారీవి, నీ కమీషన్ ఏమిటో నువ్వే గుర్తుచేసుకో. మీ అక్కయ్యకి నువ్వు పది వేలు బాకీ లేవూ? వడ్డీ లేకుండా అప్పిచ్చింది. ఆవిడ నోరెత్తకుండా ఆవిడకి సాయం చెయ్యడం, నువ్వు చేసుకున్న ఏర్పాటు. అవునో కాదో నీమనసునే అడుగు.

నిలువెల్ల ఒణికిపోయాను. ఆ చూపులు తప్పించుకుందామని అటూ ఇటూ దృష్టి మరలించాను. ఏ అలంకరించుకున్న ఆడదాన్ని చూసినా మొగ జనమంతటినీ ముక్కుపిండి నిలదీస్తున్నట్టే తోచింది.

చిరు చీకటి వేళకి సొగసు పూర్తి చేసుకుంటుంది. ఆమె ఆ వారో ఈ వారో నిలబడుతుంది. ఆ కాంత. అందుకే వారకాంత అన్నారేమో ! దేని కోసం ? ఎంతో సుఖమూ, శాంతీ దొరుకుతాయనేనా ఆ అలంకారం?

మరో చోట మరో దృశ్యం.

అప్పుడే మూడు ముళ్ళ తతంగం పూర్తయింది. నుదుట కల్యాణ తిలకంతో, బుగ్గని చుక్కతో, కొత్తనగలతో, మంచి బట్టలతో భర్త వెనకే అడుగులువేస్తోంది ఆ అమాయకురాలు. డబ్బు మనమే యిచ్చుకుని ఎదుటి మనిషికి అమ్ముడు పోవడమనే అతి నికృష్టమైన వ్యవస్థ ఆడపిల్ల కట్నం ఇవ్వడం.

ఎవరూ చూడకుండా వేస్తే కన్నం.

పలుగుర్లో పుచ్చుకుంటే కట్నం!

కట్నం పుచ్చుకునే సిగ్గుమాలిన పని, మనసున్న ఏమగాడికయినా జీవితాంతం ఉండిపోయే పుట్టు మచ్చ. భర్త వెనకే నడుస్తున్న ఆ అమ్మాయి కంట్లో కన్నీళ్ళు. సాధారణంగా ఏడుస్తూ అడుగులేస్తుంది గనుకే ఏడు అడుగులు అన్నారేమో!

సమస్త స్త్రీ జాతి నన్ను నిలదీసినట్టయింది.

అందులో పురుషుల స్వార్థమే ప్రధానమైతే, వ్యాపారమే ముఖ్య పాత్ర వహిస్తే బానిసత్వం, వివాహం, వ్యభిచారం ఈ మాటలన్నిటికి ఇంచు మించు అర్థం ఒకటే.

సిగ్గుతో తల్లడిల్లి పోయాను.

నోటితో ఒక్కముక్క చెప్పకుండా ఇంత చిన్నపిల్ల నామీద ఎంత దెబ్బ తీసింది!

అన్నీ తెలిసికూడా యింకా ఈ పాపపు పని కొనసాగించనా ? ఊహుఁ నేనో నిశ్చయానికి వచ్చేశాను.

"మీ అమ్మ దగ్గిరకి దిగబెట్టేస్తాను? వస్తావుటే" చీకటి గదిలో చిన్న దీపం పెట్టినట్టయింది దాని మొహం. ఆ చిరునవ్వు అందం ముందు నేనా పిల్లకి చేయించిన శృంగారాలన్నీ వెల వెల బోయాయి. అందరూ కొనుక్కునే బటాణీల ముందు కొందరికే అందుబాటులో ఉన్న క్రీం బిస్కట్లు ఎప్పటికైనా దిగదుడుపే కదా! ఆ జంక్షన్లో ఆగి, తిరుగు రైల్లో దాన్ని యిల్లుచేరేశాను. అదీ కనుమరుగు అయాక రవితో అబద్ధం ఆడేను, రైలెక్కిన మొదలు రంగి రానని నానా పేచీపెట్టిందని. నిజానికి రవితో ఏం చెప్పేనో, మా అక్కయ్యతో ఏం చెప్పుకున్నానో అది కాదు ముఖ్యం. ఏ మనిషి అయినా తను చేసిన పనికి తాను సంజాయిషీ చెప్పుకో గలిగితే చాలు. చేసిన తప్పు దిద్దుకునే మానవత్వం వుంటే చాలు. పది మందిని చావగొట్టే రౌడీతనంకాదు. ఏ ఒక్క ఆడపిల్ల కన్నీటిని తుడవ గలిగినా అంతేచాలు. మగతనం అంటే అదే.